ఇండోర్‌లో ఇటీవల ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న యువతులు

గడ్డం తీసేస్తేనే ప్రేమిస్తాం!

ఇండోర్‌లో యువతుల ర్యాలీ

ఇండోర్, అక్టోబర్ 19: ఉద్యోగాలు ఇవ్వాలనో, తమ సమస్యలు పరిష్కరించాలనో యువతులు ర్యాలీలు తీయడం సహజం. కానీ, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మాత్రం కొందరు యువతులు వినూత్న ర్యాలీ నిర్వహించారు. 'గడ్డం తీసేస్తేనే.. మిమ్మల్ని ప్రేమిస్తాం' అంటూ ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేశారు. దాదాపు 20 మంది యువతులు మాస్కులు ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'క్లీన్ షేవ్ లేకపోతే.. ప్రేమ లేదు', 'గడ్డం కావాలా? ప్రియురాలు కావాలా?' అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందించారు. ప్రదర్శన లేదా రీల్స్ కోసం ఇది చేసి ఉంటారని కొందరు విమర్శించగా... వారి ర్యాలీ వినోదం కలిగించిందని కొందరు కామెంట్ చేశారు.

నిఘాలో భారత దౌత్యవేత్తలు

కెనడా విదేశాంగ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

టొరంటో, అక్టోబర్ 19: భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలపై నిఘా ఉంచినట్టు ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యలు, విమర్శలతో ఇప్పటికే రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. ఒట్టావాలోని భారత హై కమిషనర్‌ను సిక్కు వేర్పాటువాది హత్య కేసులో అనుమానితునిగా చేర్చి కయ్యానికి కాలు దువ్విన కెనడా తన వైఖరిని కొనసాగిస్తూనే ఉంది. ఈ సందర్భంగా జోలి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వియన్నా సదస్సు ఒప్పందానికి వ్యతిరేకంగా వ్యవహరించిన, కెనడా వాసుల జీవితాలను ప్రమాదంలో పెట్టడానికి ప్రయత్నించిన ఏ ఒక్క దౌత్యవేత్తను సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె భారత్‌ను రష్యాతో పోల్చారు. కెనడాలో జరుగుతున్న హత్యలకు, బెదిరింపులకు భారత దౌత్యవేత్తలకు సంబంధం ఉందని ఆరోపించారు. మిగిలిన భారత దౌత్యవేత్తలనూ బహిష్కరిస్తారా అన్న ప్రశ్నపై జోలి మాట్లాడుతూ వారు ఇప్పటికే పూర్తి నిఘాలో ఉన్నారని తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌లోకి ఈఎస్ఐ

వైద్య ప్రయోజన మండలి నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఉద్యోగ రాజ్య బీమా(ఈఎస్ఐ)ను ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవైలో కలపాలని ఈఎస్ఐసీ వైద్య ప్రయోజన మండలి నిర్ణయించింది. ఢిల్లీలోని ఈఎస్ఐసీ కార్యాలయంలో జరిగిన 86వ వైద్య ప్రయోజన మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఈఎస్ఐను ఆయుష్మాన్ భారత్‌లో కలపడం ద్వారా కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని మండలి అభిప్రాయపడింది.

ఏరివేత షురూ!

- కర్ణాటకలో 5 గ్యారెంటీలకు కొత్త కొర్రీలు
- స్కీమ్ లబ్ధిదారుల సంఖ్యను కుదించడానికే
- ఖజానాపై భారాన్ని తగ్గించుకొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రకమైన ఎత్తుగడ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఐదు గ్యారెంటీల పేరిట అరచేతిలో స్వర్గాన్ని చూపించి కర్ణాటకలో కిందటేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రజలకు చుక్కలు చూయిస్తున్నది. ఇప్పుడు ఏకంగా గ్యారెంటీలను అందుకొంటున్న లబ్ధిదారుల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. ఖజానాపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడానికే ఈ రకమైన ఎత్తుగడకు తెర తీసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి ఎల్కే అతీఖ్, కార్యదర్శి (వ్యయ విభాగం) పీసీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అట్లా అయితే కష్టం

ఐదు గ్యారెంటీల అమలుకు కర్ణాటక ప్రభుత్వం ఏటా రూ.60 వేల కోట్ల వరకు నిధులు కేటాయించాల్సి వస్తున్నది. దీంతో వ్యయాన్ని తగ్గించుకొనే ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశించినట్టు సమాచారం. ఇందులో భాగంగా ఐదు గ్యారెంటీల లబ్ధిదారుల ఏరివేత చేపట్టాలని, కొత్త నిబంధనలు తీసుకొచ్చి ఈ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలని సీఎం ఆదేశించినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బడ్జెట్‌లో మెజారిటీ వాటాను గ్యారెంటీల కోసమే ఖర్చు చేస్తే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాకపోవచ్చని కూడా సీఎం అధికారుల ముందు వాపోయినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

లబ్ధిదారులను తగ్గించవచ్చు

తొలుత బీపీఎల్ (రేషన్) కార్డుల ఏరివేతను

చేపట్టాలని, తద్వారా అన్నభాగ్య స్కీమ్ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించవచ్చని సీఎం అధికారులకు సలహా ఇచ్చినట్టు తెలుస్తున్నది. మహిళలకు రూ.2 వేల చొప్పున ఇస్తున్న గృహలక్ష్మి పథకంలో కూడా కోతలు విధించాలని సీఎం సూచించినట్టు సమాచారం. ఇంట్లో ఎవరైనా సంపాదిస్తే ఆ ఇంట్లోని మహిళను ఈ స్కీమ్‌కు అనర్హురాలిగా ప్రకటించేలా కొత్త రూల్ జోడించాలని కూడా ప్రభుత్వ వర్గాలు యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. శక్తి స్కీమ్‌లో భాగంగా ఆర్డినరీ బస్సుల సంఖ్యను తగ్గించాలని, స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయాన్ని రద్దు చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇక, గృహజ్యోతి స్కీమ్ పేరిట ఇప్పటికే కరెంటు బిల్లులను పెంచిన ప్రభుత్వం.. నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున భృతి చెల్లించే యువనిధిని ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం గమనార్హం. కాగా, ఐదు గ్యారెంటీల అమలు సర్కారుకు గుదిబండగా మారిందని సీఎం సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి ఈ ఏడాది తొలినాళ్లలో చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. 'ఎన్నికల్లో ఇచ్చిన 5 గ్యారెంటీలను కొనసాగించాలంటే ఏటా రూ.58 వేల కోట్లు అవసరం. ఇది ఖజానాపై పెను భారమే. అందుకే, దీనిపై ఏం చేయాలన్న దానిపై చర్చలు జరుపుతున్నాం. ఒకవైపు గ్యారెంటీలను అమలు చేస్తూనే, వ్యయాన్ని తగ్గించుకోడానికి స్కీమ్ నిబంధనల్లో ఏమేం మార్పులు చేర్పులు తీసుకురావొచ్చో చర్చిస్తున్నాం' అని రాయరెడ్డి అన్నారు.

ఏడాదిన్నర పాలనపై సర్వేకు ఆదేశం

ఎన్నికల్లో ఇస్తామన్న గ్యారెంటీల అమలు ఎప్పుడో అటకెక్కింది. పాలన మొత్తంగా పడకేసింది. అభివృద్ధి పనుల ఊసులేదు. వీటికితోడు వాల్మీకి, ముడా తదితర స్కామ్‌లతో కర్ణాటక కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇది గమనించిన సీఎం సిద్ధరామయ్య తమ ప్రభుత్వ ఏడాదిన్నర పాలనపై సర్వే చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన భేటీలో అధికారులను ఈ దిశగా ఆదేశించారు. రెవెన్యూ రాబడులు తగ్గడంపై కూడా సీఎం అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.

ముడా ఆఫీసులో రెండో రోజూ ఈడీ తనిఖీలు

మైసూర్, అక్టోబర్ 19: ముడా భూమి కుంభకోణానికి సంబంధించి కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలు రావడంతో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నది. ఈ క్రమంలో ఈడీ అధికారులు మైసూర్‌లోని ముడా కార్యాలయంలో రెండో రోజైన శనివారం తనిఖీలు కొనసాగించారు. ముడా కమిషనర్ ఏఎన్ రఘునందన్, కార్యదర్శి ప్రసన్న వీకే, ఇతర అధికారులను ఈడీ ప్రశ్నించింది. 40 మంది సీఆర్‌పీఎఫ్ దళాలు, నగర పోలీసులతో శుక్రవారం ముడా కార్యాలయంలో రాత్రి 11.30 గంటల వరకు ఈడీ తనిఖీలు చేపట్టింది. వాటిని శనివారం కూడా కొనసాగించింది.

ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్

సభ్యురాలిగా అర్చనా మజుందార్

న్యూఢిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) నూతన చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్ రహత్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. తక్షణమే అమె నియామకం అమలులోకి వస్తుందని తెలిపింది. ఈ పదవిలో ఆమె మూడేండ్ల పాటు కొనసాగుతారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన రహత్కర్, 1995 నుంచి బీజేపీలో కొనసాగుతున్నారు. ఆమెతో పాటు కమిషన్ సభ్యురాలిగా అర్చనా మజుందార్‌ను నియమించినట్టు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ తెలిపింది.

30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: భారత్‌లో పలు విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపులు..మరింతగా పెరిగాయి. శనివారం ఒక్కరోజే వివిధ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 30కి పైగా విమానాలకు బెదిరింపులు వచ్చినట్టు అధికారులు తాజాగా వెల్లడించారు. ఎయిర్ ఇండియా, విస్తారా, ఇండిగో, ఆకాస ఎయిర్, స్పైస్ జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్..తదితర సంస్థలకు చెందిన విమానాలకు శనివారం ఉదయం నుంచి బాంబు బెదిరింపులు రావటం సర్వత్రా ఆందోళనకు గురిచేసింది. హైదరాబాద్ నుంచి చండీగఢ్ బయల్దేరిన ఇండిగో ఫ్లైట్‌కు హెచ్చరికలు జారీ కాగా, చండీగఢ్‌లో పైలట్లు విమానాన్ని ఐసోలేషన్ బే వైపు ల్యాండ్ చేశారు. బాంబు బెదిరింపు బూటకమని తేల్చారు.

ఆఫీస్ పని వేళల్లోనే ఇక ఈడీ విచారణ

ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపు • తన అధికారులకు ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఈడీ అధికారులు ఇక నుంచి అనుమానితులు, సాక్షులను ఇష్టం వచ్చిన వేళల్లో, అర్ధరాత్రి వరకు విచారణ పేరుతో వేధించడం కుదరదు. అలాగే వారిని విచారణకు పిలిచి గంటల తరబడి వేచి చూసేలా చేయడాన్ని చట్టవిరుద్ధ చర్యగా భావిస్తారు. ఇటీవల బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇక నుంచి కార్యాలయ పనివేళల సమయంలో మాత్రమే వారిని ఈడీ విచారిస్తుంది. ఈ మేరకు తన అధికారులకు ఈడీ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. అయితే కొన్ని పరిస్థితుల్లో పనివేళల తర్వాత కూడా వారిని విచారించవచ్చునని, అందుకు పైఅధికారి అనుమతి తీసుకోవాలని పేర్కొంది. కాగా, తనను ఒక కేసులో విచారణకు పిలిచిన ఈడీ అర్ధరాత్రి వరకు విచారించి ఇబ్బంది పెట్టిందంటూ 64 ఏండ్ల వ్యక్తి వేసిన పిటిషన్‌పై స్పందించిన బాంబే హైకోర్టు ఇలా ఒక వ్యక్తిని అర్ధరాత్రి వరకు విచారించడం అతడి వ్యక్తిగత, నిద్రా హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొంటూ, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. దీనిని సవరిస్తూ ఈడీ తమ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని తెలిపింది.

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సోదరుడి అరెస్ట్

బీజేపీ టికెట్ ఇప్పిస్తానని రూ.2 కోట్లకు టోకరా

బెంగళూరు: బీజేపీ టికెట్ ఇప్పిస్తానని నమ్మించి మహిళ నుంచి రూ.2 కోట్లు తీసుకుని మోసం చేసిన కేసులో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సోదరుడు గోపాల్‌జోషిని బెంగళూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన కుటుంబానికి బీజేపీ టికెట్ ఇప్పిస్తానని గోపాల్‌జోషి రూ.2 కోట్లు తీసుకుని మోసం చేసినట్టు జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే దేవానంద్ ఫూల్‌సింగ్ చౌహాన్ భార్య సునీతా చౌహాన్ గురువారం రాత్రి బసవేశ్వరనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై గోపాల్‌జోషి, విజయలక్ష్మిజోషి, గోపాల్ కుమారుడు అజయ్‌జోషిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విజయలక్ష్మి తనను తాను ప్రహ్లాద్‌జోషి సోదరిగా పరిచయం చేసుకున్నట్టు సునీత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గోపాల్ జోషి అరెస్టుపై పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. తనకు అక్కచెల్లెళ్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. గోపాల్ జోషితో మూడు దశాబ్దాల క్రితమే సంబంధాలు తెగిపోయాయని తెలిపారు.

జార్ఖండ్‌లో సీట్ల పంపకాలపై పీట ముడి

కాంగ్రెస్, జేఎంఎం తీరుపై ఆర్జేడీ అలక

రాంచి: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇండియా కూటమిలో సీట్ల పంపిణీ కుంపటి రాజేసింది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఎంసీసీ పార్టీలు కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. అయితే, ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయాలనేది మాత్రం తేల్చుకోలేకపోతున్నాయి. రాష్ట్రంలోని 81 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కలిపి 70 స్థానాల్లో పోటీ చేస్తాయని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శనివారం ప్రకటించారు. ఈ ప్రకటనపై రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) అలక వహించింది. హేమంత్ సోరెన్ తమతో సంప్రదించకుండా, ఏకపక్షంగా ఈ ప్రకటన చేశారని ఆర్జేడీ అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ ఝా ఆరోపించారు. తమకు అన్ని అవకాశాలు తెరిచే ఉన్నాయని పేర్కొంటూ, అవసరమైతే ఒంటరిగా పోటీ చేస్తామని పరోక్షంగా ప్రకటించారు. 15- 18 స్థానాల్లో తాము సొంతంగా గెలవగలమని ఆయన పేర్కొన్నారు.

పరిమితికి మించి అడ్మిషన్లు

బడా విద్యా సంస్థల దెబ్బకు చిన్న సంస్థలు మూత

పార్లమెంటరీ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: జాతీయ విద్యా విధానం-2020ని అనుసరించే సాకుతో పలు విద్యా సంస్థలు అక్రమంగా పరిమితిని మించి విద్యార్థులను వివిధ కోర్సుల్లో చేర్చుకున్నాయని ప్రభుత్వ హామీలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. అడ్మిషన్లలో నిబంధనలు ఉల్లంఘించినా, అలాంటి విద్యాసంస్థలపై యూజీసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఎం తంబిదురై నేతృత్వంలోని కమిటీ తాజా నివేదికలో వెల్లడించింది. కొన్ని బడా విద్యాసంస్థల వైఖరి కారణంగావిద్యా వ్యవస్థలో గుత్తాధిపత్యం పెరిగిపోతున్నదని కమిటీ పేర్కొంది. ఈ విద్యాసంస్థలు తమకు నిర్దేశించిన సంఖ్య కన్నా అధికంగా విద్యార్థులను వివిధ కోర్సుల్లో చేర్చుకుంటున్నాయని, దీని కారణంగా చిన్న, మధ్యస్థాయి విద్యాసంస్థలు, పలు ప్రముఖ సొసైటీ, ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్నవి కూడా మూతపడుతున్నాయని తెలిపింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొత్త విద్యాసంస్థల స్థాపనకు ఎవరూ ముందుకు రారని పేర్కొంది. దీనిపై యూజీసీ స్పందించాలని, చిన్నా, పెద్దా విద్యా సంస్థల తేడా లేకుండా అందరికీ నిబంధనలు అమలు చేయాలని కమిటీ సూచించింది.

అడవి తల్లి రక్షణకు ఆయుధాలు పట్టారు

బొగ్గు గనుల కోసం ఛత్తీస్‌గఢ్‌లో చెట్ల నరికివేత

తీవ్రంగా ప్రతిఘటించిన స్థానిక గ్రామ ప్రజలు

భువనేశ్వర్, అక్టోబర్ 19: రాడార్ ప్రాజెక్టు వల్ల ఉనికి కోల్పోనున్న దామగుండం అడవిని కాపాడుకునేందుకు తెలంగాణలో సాగుతున్న ఆందోళన తరహాలో ఛత్తీస్‌గఢ్‌లో మరో ఆందోళన మొదలైంది. మైనింగ్ కోసం హస్‌దేవ్ అటవీ ప్రాంతంలో చెట్లను నరికేయడంపై ప్రజలు ఆందోళనకు దిగారు. అడవితల్లిని కాపాడుకునేందుకు ఆయుధాలు చేతపట్టి కదం తొక్కారు. చెట్లు నరికితే చూస్తూ ఊరుకోబోమని ప్రతిఘటించారు. దీంతో హస్‌దేవ్ అటవీ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ప్రాంతంలో పలు కోల్ బ్లాక్‌లను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అదానీ సంస్థకు అప్పగించింది. పర్స కోల్ బ్లాక్ కోసం దాదాపు 96 వేల చెట్లను నరికేసి మైనింగ్ మొదలు పెట్టేందుకు ఈ సంస్థ ప్రయత్నించింది. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా పర్స గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. బాణాలు, ఉండేళ్లు, రాళ్లతో గ్రామస్థులు, లాఠీలతో పోలీసులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక సీఐ, ఒక ఎస్సై సహా ఆరుగురు పోలీసులు, 12 మంది గ్రామస్థులకు గాయాలయ్యాయి.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతి

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 19: భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. కొడలియార్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐటీబీపీ 53వ బెటాలియన్‌లో ఉన్న మహారాష్ట్రకు చెందిన అమర పన్వార్ (36), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపకు చెందిన కే.రాజేశ్ (36) మృతిచెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు.

రైల్వే ఉద్యోగాల్లో రిటైరైన వారికి అవకాశం

25 వేల పోస్టులకు తాత్కాలిక రిక్రూట్‌మెంట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: సిబ్బంది కొరతను అధిగమించేందుకు రైల్వే బోర్డు దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల పోస్టులకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఇందులో రిటైర్డ్ ఉద్యోగులకు సైతం అవకాశం కల్పించింది. 65 ఏండ్లలోపు వయసున్న రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు సూపర్‌వైజర్ల నుంచి ట్రాక్‌మెన్ వరకు వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. తాత్కాలికంగా రెండేండ్ల పాటు పనిచేసేలా వీరిని నియమించుకుంటామని, అవసరమైతే ఉద్యోగ కాలాన్ని పొడిగిస్తామని తెలిపింది. రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్‌తో పాటు ఉద్యోగ విరమణకు ముందు వారి ఐదేండ్ల పనితీరు ఆధారంగా ఈ నియామకాలను చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేసినట్టు వెల్లడించింది. ఇలా నియమితులైనవారికి గతంలో చివరిసారి పొందిన నెలవారీ వేతనం నుంచి బేసిక్, పెన్షన్‌ను మినహాయించి మిగిలిన మొత్తాన్ని జీతంగా చెల్లిస్తామని, ప్రయాణ భత్యాలు లాంటి ప్రయోజనాలను పొందవచ్చని వివరించింది. ఇంక్రిమెంట్లు, ఇతర ప్రయోజనాలు ఉండవని రైల్వే బోర్డు తెలిపింది.

ప్రజాకోర్టుగా సుప్రీంకోర్టును కాపాడుకోవాలి: సీజేఐ

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: సుప్రీంకోర్టు ప్రజాకోర్టుగా ఉండాలని, దానిని భవిష్యత్తు కోసం కాపాడుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్ అన్నారు. అయితే దానర్థం పార్లమెంట్‌లో ప్రతిపక్షం పాత్రను సుప్రీంకోర్టు పోషించాలని కాదన్నారు. శనివారం దక్షిణ గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు లోపాలపై ఎవరైనా విమర్శలు చేయవచ్చునని, అయితే కేవలం ఫలితాల కోణం నుంచి సుప్రీంకోర్టు పనితనాన్ని చూడలేరని అన్నారు. 'సుప్రీంకోర్టు నుంచి న్యాయాన్ని పొందటమన్నది గత 75 ఏండ్లుగా అభివృద్ధి చెందుతున్నది. ఈ పంథాను వీడరాదు.' అని సీజేఐ అన్నారు.

ఇదేమీ అమెరికా సుప్రీం కోర్టు కాదు

ఒక పిల్ విచారణ సందర్భంగా శుక్రవారం సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దేశంలోని వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై 'ఇదేమీ అమెరికా సుప్రీం కోర్టు కాదు' అంటూ వ్యాఖ్యానిస్తూ దానిని కొట్టివేసింది. సుప్రీం కోర్టు సహా దేశంలోని అన్ని న్యాయస్థానాల్లోని కేసులను 12 నుంచి 36 నెలల కాలపరిమితిలో పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్‌లు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. 'ఇది పూర్తిగా వాంఛితమే.. అదే సమయంలో ఆచరణ సాధ్యం కూడా కాదు' అని సీజేఐ పేర్కొన్నారు. దీనిని సాధ్యం చేయాలంటే మౌలిక వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు జడ్జీల సంఖ్యను పెంచాలని అన్నారు.

జమ్ము కశ్మీర్ రాష్ట్ర హోదా తీర్మానానికి ఎల్జీ ఆమోదం

శ్రీనగర్, అక్టోబర్ 19: జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని మంత్రివర్గం చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారని శనివారం అధికారులు తెలిపారు. గతంలో ఉన్న రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ గురువారం ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా, జమ్ముకశ్మీర్‌లో 370వ అధికరణ పునరుద్ధరణ కోసం కాకుండా కేవలం రాష్ట్ర హోదాపై మంత్రివర్గం తీర్మానం చేయడాన్ని విపక్షాలు తప్పుబట్టాయి.

టార్గెట్ నెతన్యాహూ

ఆయన నివాసం లక్ష్యంగా హెజ్బొల్లా డ్రోన్ దాడి

సమీపంలోని ఇంటిపై పేలుడు.. తప్పిన ప్రాణ నష్టం

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ నివాసమే లక్ష్యంగా శనివారం డ్రోన్ దాడి జరిగింది. లెబనాన్ నుంచి హెజ్బొల్లా ఈ దాడికి పాల్పడింది. సీసరియాలోని నెతన్యాహూ ఇంటి సమీపంలోని ఓ ఇంటి వద్ద డ్రోన్ పేలింది. దీంతో ఆ ప్రాంతంలో సైరన్లు మోగాయి. ఈ ఘటన జరిగినప్పుడు నెతన్యాహూతో పాటు ఆయన భార్య ఇంట్లో లేరని ప్రధానమంత్రి అధికార ప్రతినిధి ప్రకటించారు. డ్రోన్ దాడితో ఓ భవనం పాక్షికంగా ధ్వంసమైందని, ఎవరికీ గాయాలు కాలేదని స్థానిక మీడియా వెల్లడించింది. హెజ్బొల్లా ప్రయోగించిన మరో రెండు డ్రోన్‌లను కూల్చివేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. హమాస్ అధినేత యహ్యా సిన్వర్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించిన రెండో రోజే ఈ దాడి జరిగింది.

యుద్ధాన్ని గెలవబోతున్నాం: నెతన్యాహూ

తన ఇంటిని లక్ష్యంగా చేసుకొని జరిగిన డ్రోన్ దాడిపై నెతన్యాహూ స్పందించారు. తనను ఏదీ నిరోధించలేదని, ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ గెలవబోతున్నదని పేర్కొన్నారు. 'మన మగవారి తలలు నరికిన, మహిళలను అత్యాచారం చేసిన, బిడ్డలను ప్రాణాలతో తగలబెట్టిన దుండగులకు ఉగ్రవాద మాస్టర్‌మైండ్(సిన్వర్)ను అంతం చేశాం. ఇరాన్ పరోక్ష ఉగ్రవాద సంస్థలతో మా యుద్ధం కొనసాగుతుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. డ్రోన్ దాడిలో ఇరాన్ హస్తం ఉందని ఇజ్రాయెల్ ఆరోపించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో 44 మంది మృతి

గాజాపై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రమయ్యాయి. శనివారం ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ బలగాలు విరుచుకుపడ్డాయి. శరణార్థ శిబిరాలతో పాటు దవాఖానాలపై వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 44 మంది మరణించడంతో పాటు 80 మంది గాయపడ్డట్టు స్థానిక మీడియా తెలిపింది. మరోవైపు, ఇజ్రాయెల్‌పైకి సిరియా సైతం వైమానిక దాడులకు దిగింది. అయితే, ఈ దాడులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

గన్‌షాట్ వల్లే సిన్వర్ మృతి

ఇజ్రాయెల్ దళాల చేతిలో హతమైన



హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్ మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. తలలోకి దూసుకెళ్లిన బుల్లెట్ గాయం కారణంగానే అతడు మృతి చెంది ఉంటాడని పోస్టుమార్టం నిర్వహించిన ఇజ్రాయెల్ వైద్యుడు డాక్టర్ చెన్ కుగెల్ తెలిపారు. ట్యాంక్ లేదంటే, మిసైల్ నుంచి వచ్చిన షెల్ వల్ల ఆయన చేతికి గాయమైందని, రక్తస్రావాన్ని ఆపేందుకు చేతి చుట్టూ ఓ వైర్‌ను చుట్టుకున్నాడని తెలిపారు.

హమాస్ ఉనికికి ఢోకా లేదు: ఖమేనీ

హమాస్ ఉనికిలోనే ఉందని, ఎప్పటికీ ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు మట్టుబెట్టడంపై ఆయన స్పందిస్తూ ఆయన మృతి చెందినంత మాత్రాన అంతా అయిపోయినట్టు కాదని, హమాస్ ఉనికికి ఎలాంటి ఢోకా లేదని అన్నారు.

ఇజ్రాయెల్-హమాస్ మధ్య సయోధ్య కష్టమే

ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండింటి మధ్య ఒప్పందం కుదర్చడం కంటే ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య రాజీ జరపడమే సులువని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం బెర్లిన్‌లో జరిగిన సమావేశంలో బైడెన్‌తో పాటు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం త్వరలోనే జరిగే అవకాశాలున్నాయని చెప్పారు.

12 ఏండ్లుగా కడుపులో కత్తెర

ఆపరేషన్‌లో మరచి తాజాగా తొలగింపు

గ్యాంగ్‌టక్, అక్టోబర్ 19: ఆపరేషన్ సమయంలో ఒక మహిళ పొత్తి కడుపులో ఉంచి మరచిపోయిన కత్తెరను 12 ఏండ్ల తర్వాత డాక్టర్లు తొలగించిన ఘటన సిక్కింలో చోటు చేసుకుంది. ఒక మహిళకు ఎస్‌టీఎన్ఎం దవాఖానలో 12 ఏండ్ల క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో శస్త్రచికిత్సలో వాడే ఒక కత్తెరను ఆమె కడుపులో ఉంచి కుట్టేశారు. చివరకు ఆదే దవాఖానలో ఎక్స్‌రే తీయగా ఆమె కడుపులో కత్తెర ఉన్నట్టు గుర్తించారు. గురువారం శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఈ ఘటనపై విచారణకు ఒక కమిటీని నియమించారు.

యూపీలో ఐదేండ్ల బాలికపై రేప్

లక్నో, అక్టోబర్ 19: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓ ఐదేండ్ల బాలికపై ఆమె ఇంట్లో అద్దెకు ఉన్నవాళ్లే లైంగిక దాడికి పాల్పడ్డారు. 6 ఏండ్లు, 13 ఏండ్లు, 16 ఏండ్ల వయస్సు కలిగిన ముగ్గురు బాలురు బాలికను ఇంటి పైకి తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలియా జిల్లా కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుది. నిందితులను అరెస్టు చేశామని పోలీసులు శనివారం మీడియాకు తెలిపారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్, పోక్సో కింద నిందితులపై కేసు నమోదు చేశారు.